కథానిక

# నీడ

చామర్తి దుర్గాప్రసాద్

'తప్పదు' అనుకున్నాడు మేజర్ జనరల్ నంబియార్. ఆ గదిలో అతని రెజిమెంటు గెల్చుకొన్న రంగులు, పతకాలు అందంగా మెరుస్తున్నై.

రెండు రోజుల క్రిందటనే ఎస్. డి. హాస్పిటల్ ఏరియాలో ప్రమాదం జరిగింది. సైకిల్ మీద పోతున్న కుర్రాణ్ణి కిందపడేసి మీంచి పోయింది ఆర్మీ ట్రక్.

తన రెజిమెంటులో ఉన్న వాళ్ళందర్నీ కడుపులో పెట్టుకొని కాపాడడం తన విధి. తన నీడలో వాళ్ళు చల్లగా ఉండాలి. తప్పు చేస్తే మాత్రం వాళ్ళని తను కాపాడవద్దా? తండ్రి తన పిల్లల తప్పుల్ని కాయడూ! అలా చెయ్యకపోతే వాళ్ళు ప్రాణాలను తెగించే పనులు చెయ్యగలరా? రేపంటే ఏమిటో అనుమానమయిన బతుకులు కదా!

రేపంటే ఏమిటో అనుమానంగానే తయారయింది సామాన్యుల బతుకు కూడా. తన ట్రక్ డ్రైవర్ల మూలంగా. ఒకసారి హెచ్చరించాలి. అయినా కాపాడాలి ఇప్పుడు.

అతని ఆలోచన నిజం. అందుకే అతను నిప్పుల్లోకి దూకమంటే దూకుతారు వాళ్ళు. అతన్ని మార్చాలన్న ప్రపోజల్ ఒకసారి వస్తే, అందరూ ఎదురు తిరిగి కోర్టు మార్షల్ కయినా సరే సిద్ధం అయ్యారు. ఆ అనుబంధం అలాంటిది. అందుకే ఆ రెజిమెంటు వార్ ఫ్రంట్‌లో నిప్పుల్లో జొరబడి పతకాలను గెలుచుకొన్నది.

ఆ పతకాలు అద్దాల బీరువాలో అందంగా, మనిషి ప్రాణంలా మెరుస్తున్నవి. మనిషి ప్రాణంలా అన్న ఆలోచన వచ్చినందుకు నంబియార్ సంతోషించాడు. ఎంతమంది మనుషుల ప్రాణాల మారు రూపాలో ఆ పతకాలు!!

ఆ కుర్రాడు ఎంతో ఎడమ పక్కగా పోతున్నాడు. ఆయినా యాక్సిడెంట్ జరిగింది. లేత కుర్రాడు రక్తంలో ముద్ద అయ్యాడు. పువ్వులాంటి కుర్రాడు అర సెకనులో మట్టిలో కలిశాడు. అతని జేబులో ఏదో స్కాలర్‌షిప్ అప్లికేషన్ కాగితాలు. మరో జేబులో హోలీ ఆడుకునేందుకని కొనుక్కున్న రంగుల పొట్లం—హాండిల్ బారుకు తగిలించిన సంచిలో రేషన్లూ, రేషన్ కార్డు. పదిహేనేళ్ళ కుర్రాడు—ఎంత బాధ్యత తెలిసిన వాడు! ఏ తండ్రికయినా అలాంటి కుర్రాడు ఎంత గర్వకారణం!

"బాధ్యత". నంబియార్ నిస్పృహగా నిట్టూర్చాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. తప్పు తమదే. తనూ, డ్రైవరు మీనన్ ఆ మిట్టమధ్యాహ్నం, సెలవు కావడాన బార్‌లో తాగి వస్తున్నారు. మీనన్ అంత మరీ కంట్రోల్ తప్పేలా తాగాడనుకోలేదు తను.

"బాధ్యత". ఆ కుర్రాడు ఆ తల్లి తండ్రుల కెంత ఆసరావో!

మహాకవి పుష్కిన్, 'ఇన్‌స్పెక్టర్ జనరల్'

పుష్కిన్ ఒక చిన్న పట్టణానికి ఏదో పనిమీద వెళ్ళేరట. పుష్కిన్ ధనవంతుడు, ఆడంబరంగా దుస్తులు ధరించేవారు. అతనిని చూచి ఆ పట్టణవాసులు అతనొక పెద్ద ప్రభుత్వోద్యోగి అనుకుని భయపడ్డారట. తాను ప్రభుత్వోగిని కాననీ, తానొక కవిననీ చెప్పినా చాలమంది నమ్మలేదట. ఈ సంఘటనను పుష్కిన్ ఒకసారి నికొలై గొగోల్‌కు వర్ణించి చెప్పేరట. అది విని గొగోల్ "ఇన్‌స్పెక్టర్ జనరల్" అనే ప్రపంచ ప్రసిద్ధ నాటకాన్ని రచించారట.

తను వెంటనే ప్రమాదం చూశారనుకున్న షాపు వాళ్ళని కలిశాడు. వాళ్ళు షట్టర్లు దించేశారు. "సైకిల్ మీద మరో కుర్రాడున్నాడనీ, వాడు దూకడం వలన బాలెన్స్ తప్పి సైకిల్ పడిందనీ" చెప్పడానికి ఒకణ్ణి సంపాయించాడు. అంతా ఆ క్షణంలో—ఆ కుర్రాడు శ్వాసవిడుస్తున్న సమయంలోనే చకచకా చేశాడు. అయితే ఆస్పత్రి కతన్ని తీసుకెళ్ళి ఉపయోగం లేదని రూఢి చేసుకున్నాకే.

సివిల్ పోలీస్ నుంచి తప్పించి మిలిటరీ కోర్టుకు కేస్ రప్పించే ఏర్పాట్లు చురుగ్గా చేశాడు. డబ్బు, పరపతీ, ప్రాపకం అన్నీ వాడుకొన్నాడు.

ఇప్పుడే మిలిటరీ పోలీస్ నాయర్, తండ్రి స్టేట్‌మెంటు ఇచ్చి వెళ్ళాడు. "కుర్రాడికి స్నేహితులు బోలెడుమందనీ, అందరితోనూ కలిసి చలాకీగా తిరుగుతుంటాడనీ" రాశాడు. ఆ రోజు ఇంకెవరైనా వెళ్ళారా అన్న ప్రశ్నకు తనకు తెలీదని మాత్రమే జవాబు రాశాడు.

పదిహేనేళ్ళు కంటిరెప్పలా కాపాడుకొని ఆ క్షణం దారుణంగా చెట్టంత కొడుకుని పోగొట్టుకున్న నిర్భాగ్యుడు అమాయకంగా నిస్పృహలో, నిర్వేదంలో ఇచ్చిన స్టేట్‌మెంటు అది. ఆ దారుణానికి బాధ్యులయిన వాళ్ళని రక్షించేందుగ్గానూ ఆ కాగితాన్ని పదిలంగా ఫైల్లో చేర్చాడు తను.

నాలుగు రోజుల తర్వాత ట్రక్ ఆపి కిళ్లీకొట్టులో సిగరెట్లు కొనుక్కుంటున్నాడు నంబియార్. అతన్ని గమనించకుండా ఎవరో అన్న మాటలు విన్నాడు. "తప్పించారటగా! మిలిటరీ వాడికేం తెలుస్తుంది మనిషి ప్రాణం విలువ! ఇది పదహారో ప్రమాదం మిలిటరీ ట్రక్కుల కిందపడి పసిపిల్లల చావడం. వాడి కొడుకు పడితే గాని తెలీదు".

నంబియార్ తల వంచుకొని వచ్చేశాడు. ట్రక్ నెమ్మదిగా తోలమని డ్రైవర్ సింగుని చిరాగ్గా హెచ్చరించాడు. ఊటీలో చదువుకొంటున్న పువ్వులాంటి తన కొడుకు జ్ఞాపకానికి వచ్చి కళ్ళు తుడుచుకొన్నాడు.

గేట్‌లోకి రాగానే, ఆర్డర్లీ టెలిగ్రాం అందిచ్చాడు. రోజూ లక్ష అలాంటివి. కానీ అది అందుకొంటూంటే అతని చేతులు వణికాయి. విప్పకుండానే రూమ్‌కి వెళ్తూ ఎవరో తరుముతున్నట్లనిపించి వెనక్కి తిరిగాడు.

నల్లగా, పొట్టిగా, తారు బొమ్మలా, చిన్న పిల్లాడిలా—తన నీడ.

## సూర్యులు

తిరునగరి

*ఈ కన్నీళ్ళను వ్యాఖ్యానించే వాడు*
*ఇంతవరకూ కన్పించలేదు*
*ఈ రక్తానికి భాష్యం చెప్పేందుకు*
*ఎవడూ ఏదీ ముందుకు రాలేదు*
*ఈ వినిపించే కేకలన్నీ వెర్రివని*
*ఇక్కడి వేదాంతులు భ్రమపడు*
*తున్నారు*
*ఈ చెట్లు కింది జీవితాలన్నీ*
*పిచ్చివాళ్ళ రూపాలని*
*ఏంచక్కా ఆ పక్క నవ్వుకుంటున్నారు*
*ఈ కన్నీళ్ళే త్వరలో ఉప్పొంగుతాయని*
*ఈ రక్తం పతాకమై దిగ్వీధుల*
*కెదుగుతుందని*
*ఈ వెర్రి కేకలే*
*ఏ విప్లవానికో ఉషో గీతాలని*
*ఈ చెట్లకింద కదలే రూపాలు*
*రేపటి నవ జగన్నిర్మాతలని*
*తెలుసుకునే దెన్నడీ*
*దివాంధాలు?*
*ఉదయం వెన్నుతడుతున్నది చూడు*
*వీళ్ళంతా ఇక*
*ఉజ్వల మార్తాండాలు.*